# ఆదర్శ స్త్రీ పురుషులు




కూర్పు:

**తూములూరు ప్రభ**

**తూములూరు కృష్ణమూర్తి**

## ఇందులో . . .


ఒకమాట

సతీ - సతుల ప్రమాణ నిబంధన

ప్రకృతి - పురుషుడు

మహిళలు - వారి పవిత్ర కర్తవ్యము

స్త్రీలు వారి పవిత్ర కర్తవ్యము

ముగింపు



*ప్రచురణ:* **తూములూరు పబ్లికేషన్స్**
'అనసూయ'. సి-66, డి.డి.కాలనీ, హైదరాబాద్-7.
ఫోన్: 040-27427083, 27428904
E-mail: tkm_hyderabad@yahoo.co.in

*ముద్రణ:* **విష్ల కంప్యూటర్ సర్వీసెస్**
(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైదరాబాద్-44. ఫోన్:27676910

మూల్యము : **రూ.5/-**

# ఒక మాట

1974 నుంచీ భగవానుల దివ్య అనుభవాల్తో, అనుభూతుల్తో, సాయి సరస్వతి అనుగ్రహించిన నాలుగు మాటల్ని సాయి కోసమే, సాయి సాహిత్యంలోను, సాయి సాహిత్యంతోను గడుపటంగా ఉంటున్నది. ఆ పవిత్ర ప్రక్రియలో ఎప్పుడు వ్రాయాలనిపిస్తే అప్పుడది వ్రాస్తుండటం, భగవానులు సంకల్పించినప్పుడది పది మందితో పాలు పంచుకోవటం జరుగు చున్నది. నిరంతరం సాగే సాయి ప్రబోధలు. కాల నిర్ణయం వెనుకాముందులు అక్కరలేదు. ఆ విధంగా 'వటుడింతై' అన్నట్లు చిన్న చిన్నగా వ్రాసి ఉంచిన వ్యాసాలు, భగవానుని దివ్య ఆశీస్సులతో పుస్తక రూపం ధరిస్తున్నాయి. సత్యసాయి భగవానునకు సదా కృతజ్ఞతాంజలు లర్పించు కుంటున్నాము.

2003 నవంబరు 19 దవ తేదీ మహిళాదినంగా భగవాన్ ప్రకటనతో ఉద్యుక్తులంకాగా తక్కువ వ్యవధిలో, దీనిని సర్వాంగ సుందరంగా తయారు చేసి భగవాన్ కి అర్పించు కొన వీలు కల్గించిన సాయి సోదరులకు కృతజ్ఞతలు.

హైదరాబాదు **తూములూరు ప్రభ**

9-11-03 **తూములూరు కృష్ణమూర్తి**

# సతీ పతుల ప్రమాణ నిబంధన

సృష్టిలో స్త్రీ పురుషుల ఉపాధి భేదం తప్ప మానసిక సంబంధమైన పరిస్థితులన్నీ ఇద్దరికీ సమానమే. సంతోషం, దు:ఖం, ఆకలి, కోపం మొదలైనవన్నీ ఇద్దరిలో సమానంగా ఉంటాయి, అయితే ఒకరు నిగ్రహించు కోగల్గుతారు. ఒకరు నిగ్రహించుకో లేక బాధ పడి, ఇతరుల్నికూడా ఇబ్బంది పెడతారు. నిగ్రహం వలన పరిస్థితుల ప్రభావాలు ఇరువురి మీదా వేరు వేరు గా వుండవచ్చు. వ్య క్తిత్వాన్ని ఆధారంగా చేసుకుని స్త్రీ పురుషులు తమలో ఉన్న లక్షణాలకి వేరు వేరుగా స్పందిస్తుంటారు. ఆ విధంగా, పురుషులు ధైర్యస్థులు, వీరులు. ధీరులు అని; స్త్రీలు బలహీనులని, శక్తి సామర్థ్యాలు తక్కువని అనేస్తారు. ఇదంతా కూడా ప్రజల భావనే. సహజంగా స్త్రీ పురుషుల్లో కొన్ని లక్షణాలు విలక్షణంగా ఉంటుంటాయి. వాటిని ఎవరికి వారు మంచిగా పవిత్రంగా, తమకు, కుటుంబానికి, సంఘానికి ఉపయోగ కరంగా, సహాయకారిగా ఉండేటట్లు పోషించు కోవాలి, విచక్షణ, విజ్ఞతలతో, అంతేకాని

generalise చేస్తూ, విమర్శించుకోటాలు, నిందించు కోటాలు, తప్పు పట్టటాలతో ప్రయోజనం ఉండదు, ఈ సందర్భంలోనే మన మధ్య, మనతో ఉంటూ, మనల్ని మార్చాలని ఎంతగానో 'అహరహం' కృషిచేస్తున్న సత్య సాయి ప్రబోధలు ఉపకరిస్తాయి. వారు 'నా జీవితమే నా సందేశం - అది ప్రేమ సందేశం' అంటూ, ప్రతీదీ ఆచరణలో చేసి చూపిస్తూ, అవకాశమున్నప్పుడల్లా 'అమ్మ'లా అన్నీ చెపుతుంటారు. వారు ఒక్క అమ్మకాదు. ఎంతో మంది అమ్మలకు అమ్మ. అంతేకాదు శాస్త్రాల్లో చెప్పినట్లు ' ముగురమ్మల (పార్వతి, సరస్వతి, లక్ష్మి) మూలపుటమ్మ' (మూలాధారమైన అమ్మ) ఓపిగ్గా, ప్రేమతో,(ఇతర భావాల్ని అవసరాన్ని బట్టి నటించి ప్రదర్శిస్తూ) మనకోసం శ్రమిస్తున్నారు, 'నేను స్త్రీలలో స్త్రీని, పురుషులలో పురుషుణ్ణి, పిల్లల్లో పిల్లడిని, నేను ఒంటరిగా ఉన్నప్పుడు భగవంతుణ్ణి' అని చెప్పుతూ, స్త్రీగా, పురుషుడుగా (పురుషోత్తముడుగా) మారాంచేసే పిల్లాడిలా, తమ దైవత్వాన్ని నిరూపిస్తూ, వారి ద్వారా మనము నేర్చుకునేటట్లు చేస్తున్నారు. వారికి తెలియని విషయం

లేదు. వారు చెప్పని విషయంలేదు. 1940 అవతార ప్రకటన నుంచి ఇప్పటివరకూ, చెపుతున్న, చెప్పిన విషయాలు మనకి అందు బాటులో లేని సంస్కృతంలో ఉన్న వేద, పురాణశాస్త్రాలనన్నిటికీ తేటనీ తెలుగులో తిరిగి వ్రాసినట్లే - చెప్పినట్లే - అవన్నీ మనకి తెలియచెప్పే భాష్యాలు. ఆ విధంగా స్త్రీ, పురుషుల తత్వాలు, స్వభావాలు. లక్షణాలు, లక్ష్యాలు, కర్తవ్యాలు గురించి భగవాన్ సాయి బాబా విశ్లేషించి, ఉల్లేఖించిన విషయాల్ని క్రోడీకరించడమైంది.

స్త్రీ తనకి ప్రకృత సిద్ధంగా ఉన్న లక్షణాల్ని పోషించుకుంటే శ్రేయస్కరం. స్త్రీ తత్వంలో త్రిగుణాత్మక లక్షణాల్లో (తామసిక, రాజసిక, సాత్వీక) సాత్వీక గుణం ప్రధానమైంది. స్త్రీలో వినయ విధేయతలు, సిగ్గు, లజ్జ, భిడియం మొదలైన లక్షణాలు ముఖ్యంగా ఎక్కువ పాళ్ళలో ఉంటాయి. పురుషునికి ఒకే గృహము. స్త్రీకి రెండు గృహాలు - పుట్టినిల్లు, మెట్టినిల్లు ఉంటాయి. అందుకు స్త్రీ రెండు గృహాల్ని (నిభాళించుకుంటూ), సంభాళించుకునే చాకచక్యం కలిగి ఉండాలి. రెండు

గృహాలకీ సత్కీర్తి తీసుకురావాలి. 'గృహిణి, ఇల్లాలు, ధర్మపత్ని, గృహలక్ష్మి' అని వివాహిత స్త్రీకి ఎన్ని బిరుదులున్నా, ఆ పదాల అర్థాలు, అంతరార్థాలకి తగినట్లు ఆదర్శాన్ని పోషించుకోవాలి. 1995 సంత్సరములో నవంబరు 19 మహిళాదినంగా పరిగణిస్తూ భగవాన్ అనుగ్రహించిన దివ్య సందేశం ఇవ్వటమైంది. దయచేసి చూడండి.

అనేక ఇతర సందర్భాలలో స్వామి ఉద్ఘాటించిన విషయాలే ఈ పుస్తకంలో చోటు చేసుకుంటున్నాయి. గృహిణి తన ఇంటిని తీర్చిదిద్దుకుంటూ, భర్త, బిడ్డలకు క్రమశిక్షణ, మంచి అలవాట్లు, పరిశుభ్రత, వినయం మొదలైన పవిత్ర భావాలు తో మంచిగా ఆదర్శ ప్రాయులుగా తయారయేటట్లు చెయ్యాలి. 'ఇంటిని చూచి ఇల్లాలిని చూడు' అనే మాట సార్థకమయేలా చూడాలి.

'ఉద్యోగం పురుషలక్షణమే' అయినా, ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది స్త్రీలు కూడా ఉద్యోగం చేస్తున్నారు. అయితే పురుషులతో స్త్రీలు కూడా

"ఉద్యోగము చేయ ఉవిదలందరు పోగ
గృహ కృత్యములను తీర్చు గృహిణులేరి?
ఆలు మగ లిరువురును ఆఫీసులకు పోవ
బిడ్డలను పోషించు తల్లు లేరి?
పుస్తకాల్ చేపట్టి పురుషులవలె పోవ
వంట ఇంటిని దిద్దు వనితలేరి?
దుడ్డు వలన కలుగు ఇబ్బంది తీరిన
ఇంటిలోని పనుల కొరత ఎంత యుండు!
సుఖము చూడబోగ సున్నయే
ఉద్యోగ పదవి యందున్న పడతికి." అని భగవాన్

పై విధంగా ఉద్యోగము చేసే స్త్రీలకు సుఖం కరువవుతుంది; ఇల్లు దిద్దుకుంటూ, ఉద్యోగ బాధ్యతలు నెరవేర్చటం కష్టమనే అభిప్రాయాన్ని భగవాన్ బాబా వెలిబుచ్చారు. అంతేకాని బాబాకి ఆడవాళ్ళు ఉద్యోగం చెయ్యటం ఇష్టం లేదని మనం అనుకోకూడదు.

భగవాన్ అనంతపురంలో మహిళ కళాశాల స్థాపించి, ఎంతోమంది మహిళలు ఉద్యోగాలు చేసుకునే అవకాశాలు కల్పించటం, ఎంతో మంది బాలికలు ఆ కళాశాలలో

విద్యనభ్యసించి మేటి పట్టాల్ని, పదవుల్ని చేపట్టటం మనందరికీ తెలిసిన విషయమేకదా!

స్త్రీలు దురాశతో ధనాశకు పోక కుటుంబ గౌరవాన్ని కాపాడుతూ, ఆత్మగౌరవాన్నికాపాడుకుంటూ, ఆదర్శ కుటుంబాన్ని తీర్చిదిద్దే పవిత్ర ఆశయం కూడా చేపట్టాలి. అయితే అది అంత తేలికైనది కాదు. "ఒకే తల్లి పిల్లలు, ఒకే గూటిగువ్వలే" అయినా ఇంట్లో ఉన్న పిల్లల్లో ఒకొక్కరికి ఒకో మనస్తత్వం, ఒకోరకం ప్రవర్తన ఉంటుంటుంది. అందరినీ వినయ విధేయతలు, క్రమశిక్షణ, నీతి నిజాయితీలు, సత్ప్రవర్తన వంటి సద్గుణాలు అన్నీ నేర్పుతూ, అందర్నీ ఒకేత్రాటి మీదికి తీసుకురావటం చాలా కష్టంతో కూడిన పనే. అయినా, భగవంతుని మీది విశ్వాసంతో, భగవంతుడు మధ్య మధ్య కలుగచేసే పరరీక్షలకు, అవాంతరాలకు నిలదొక్కుకుని, భగవత్ప్రీత్యర్థంగా చేసే పవిత్ర కార్యంగా ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్ది వారిని దేశానికి అందివ్వటంలో స్త్రీకి కలిగే ఆనందం, తృప్తి ఇంతా అంతా కాదు.

అందుకు స్త్రీలు గృహిణులుగా ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటూ, భర్త,పిల్లలను చక్కగా చూచుకొంటూ నిర్మలమనస్సుతో ఆనందంగా ఉండాలి. "వంటకు పయోగించే కూరల్ని ప్రేమ అనే జలంతో కడుగుతున్నట్లు, జ్ఞానమనే అగ్నిలో ఉడుక బెడుతున్నట్లు భావించాలి. బియ్యంలోని రాళ్ళను వేరుచేసేటప్పుడు, తనలోని దుర్గుణాలను దూరంచేసి, సద్గుణాలను పెంచుకుంటున్నా ననుకోవాలి. ఇల్లు ఊడ్చే సమయంలో నాహృదయాన్ని పరిశుద్ధం చేస్తున్నానని, చపాతీలు, పూరీలు చేసేటప్పుడు నా హృదయాన్ని విశాలం చేసుకుంటున్నానని అనుకుంటే జీవితం ఎంతో హాయిగా ఉంటుంది.

'అమ్మ,మాత, తల్లి' అనే పదాలకు భారతదేశంలో గొప్ప విలువ ఉంది. ఎవరికైనా బాధ కలిగినప్పుడు అమ్మా అంటాడు కాని అయ్యా, అప్పా అనడు. పిల్లలకు మొట్టమొదట వచ్చే పదం ఇదే. తల్లి ప్రేమ వర్ణనా తీతమైనది. భారతీయ సంస్కృతి 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ' అని తల్లికి ప్రథమ స్థానమిచ్చింది. "క్రూరులైన పిల్లలుండొచ్చు

కాని, క్రూరురాలైన తల్లి ఉండదం"టారు భగవాన్. ప్రేమ మూర్తిని తల్లిని ప్రేమమించాలి. గౌరవించాలి.

స్త్రీకి ప్రథమ స్థానమని అహంకారంతో, అసూయతో పురుషుడు ఆమెను అగౌరపరచకూడదు. చులకన చెయ్య కూడదు. స్త్రీని గౌరవించినప్పుడు పురుషుని గౌరవం కూడా పెరుగుతుంది. స్త్రీ హృదయాన్ని నొప్పించకూడదు. కఠినమైన మాటల్తోబాధ పెట్టకూడదు. భార్యను ఇష్టమొచ్చిన ట్లు తిట్టటానికి, బాధ పెట్టటానికి భర్తకు అధికారం లేదు. మగవారికి కోపం, చిరాకు ఎక్కువ. సహనం తక్కువ. స్వతస్సిద్ధంగా ఉన్న అవలక్షణాల్ని అదుపులో పెట్టుకోవాలి.

వరలక్ష్మీ దేవి 'లోకమాత'. 'సాయి మాత' ప్రత్యక్ష ప్రేమ స్వరూపిణి. మగవారిలో కంటే స్త్రీలకే భక్తి, శక్తి, అధికంగా ఉంటాయి. అందుకు భార్య ఆచరించే పూజల్ని, పవిత్ర కార్యాల్ని భర్త ప్రోత్సహించాలి. స్త్రీ పురుషులకు విలక్షణమైన స్వభావాలు, తత్వాలు ఉన్నా, సర్వులకూ సమానమైనది 'ధర్మం' అనేదే ముఖ్య లక్షణం. స్త్రీకి ఏక పతి ఎట్లో పురుషునికి ఏక సతి అట్లు. "స్త్రీలకు పతివ్రత ధర్మమెట్లో పురుషులకు బ్రహ్మచర్యమట్లు."

బ్రహ్మచర్యమంటే పెళ్ళిచేసుకోకుండా ఉండటం కాదు. నిర్మలమైన మనస్సుతో, పవిత్ర ఆచరణతో, చిత్తశుద్ధితో ఉండటమే. ఆ విధంగానే 'పతివ్రత ధర్మం' అంటే పతిపట్ల సతికిగల సచ్ఛీలమనే మహాశక్తి. ఈ మహాశక్తి స్త్రీలకు "శిరోమణి". స్త్రీ తన పాతివ్రత్య శక్తిచే సులభంగా రక్షింపబడుతుంది. గొప్ప విపత్తులనుండి తనను తాను కాపాడుకొనుటే కాక పతి క్షేమమునే లక్ష్య మందుంచుకొని స్వార్థరహితశక్తితో దేనినైననూ సాధించ గల్గుతుంది. అట్టి సాధ్వీమణులెందరో మనకున్నారు. తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు, అత్తమామలు, సుతులు, గురువులు, బంధవులు (సకల సంపన్నురాలైన) స్త్రీకి ఎందరున్నను, సతికి సుఖ సంతోషములనిచ్చువాడు పతియే. అతడు తప్ప అన్య గతి ఉండదు. తనువు, ధనము, పురము, రాజ్యము మొదలైన వన్నీ పతి దూరమైన సతికి దు:ఖము నిచ్చును గాని ఆనందము నివ్వలేవని భావించుటే పాతివ్రత్య ధర్మము. అనసూయ (అత్రి మహర్షి భార్య, దత్తాత్రేయుని తల్లి). సతీసావిత్రి, సీతామహాతల్లి, తారాదేవి (వాలి భార్య) మొదలైన వారెందరో తమ

పాతివ్రత్య మహిమచే, ధర్మముచే, శక్తిచే వాసిగాంచినారు.

"గత జీవుడగు పతిన్ బ్రతికించి యముగెలిచె
సావిత్రి భారత సాధ్వి కాదే
తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చి
దృతి చంద్రమతి భారతీయ కాదే
కుల సతీత్వము అగ్నిగుండాన ప్రకటించె
సీత భారత ధరాజాత కాదె
కినిసి దుర్మద కిరాతుని బూదిగావించె
దమయంతి భారత రమణి గాదె
సత్య సాగర వేష్టి తత్వాతలమున
భారత జాతి పతివ్రత ప్రభావ
సంపన్నకిది కాదె పంట భూమి"

త్యాగం, సంతృప్తి, సౌశీల్యం, గౌరవం, మర్యాద మొదలైన సద్గుణాలెన్నో స్త్రీలలో ఉన్నాయి. కనుకనే స్త్రీలకే అధిక గౌరవం ఇవ్వబడుతోంది. లగ్న పత్రికలపైన కూడా శ్రీమతి అని ముందు స్త్రీ, తర్వాత పురుషుని పేరు వ్రాస్తారు. పార్వతీపరమేశ్వరులు, లక్ష్మీనారాయణులు, సీతారాములు అనే పేర్లలో కూడా స్త్రీ పేర్లే ముందున్నవి.

స్త్రీలు లక్ష్మీ స్వరూపులు. ఎన్నో యుద్ధాలు జరిగి ఎన్నో రాజ్యాలునాశనమై పోయినా, గుణవంతులైన స్త్రీలుండంచేత భారత దేశానికి మాత్రం ఎట్టి ప్రమాదము సంభవించలేదు. దేశం నిత్య కళ్యాణం పచ్చతోరణంగా ఉంటున్నది. స్త్రీలు మాత్రమే నిబంధనలకు బద్ధులని, పురుషులు స్వతంత్రులని భావించ కుండా అందరూ ధర్మమును పాటించవలసిందే. ధర్మకర్మలందు ఇద్దరూ సమానులే. ఇద్దరూ శాంతి, సత్య, ప్రేమ, అహింసలను పాటించ వలసిందే. స్త్రీలు కొన్ని విషయాల్లో అస్వతంత్రులెట్లో పురుషులు కూడా అట్లే కొన్నిటి యందు అధికారం లేదు. ఇవి "సతీపతుల ప్రమాణ నిబంధన". అందుచే అందరూ లోక సబంధమైన సుద్దులకు మాత్రమే ప్రాధాన్యమివ్వక సత్య సాయి ప్రబోధలు ఆచరిస్తూ లోకేశుణ్ణి (సత్య సాయీశ్వరుణ్ణి) ఆశ్రయించిన సర్వకార్యములు సిద్ధిస్తాయి.

**శుభం.**

# ప్రకృతి - పురుషుడు

ప్రపంచంలో ప్రతి పదార్ధము అణువులతో కూడినటు వంటిది. ప్రతి అణువు నందు ఎలక్ట్రాన్, ప్రోటాన్ అని రెండు శక్తులుంటున్నాయి. సంస్కృతంలో ఎలక్ట్రాన్ అంటే ఋణభాగం, ప్రోటాన్ అంటే ధన భాగాన్ని సూచిస్తాయి. ఎలక్ట్రాన్ స్త్రీ తత్వాన్ని ప్రోటాన్ పురుష తత్వాన్ని గుర్తింప చేస్తాయి. ఈ రెండింటి చేరిక ద్వారానే అణువు లేర్పడుతున్నాయి. ఆ విధంగా స్త్రీ, పురుష తత్వాల కూడిక అణువులతో ఏర్పడిన స్వరూపమే, ఈ జగత్తు. కనుక దీనిని అర్ధనారీశ్వర స్వరూపమని మన పూర్వీకులు నిర్ణయించారు. మానవునిలో జడంగా బయట ఉన్న దేహము స్త్రీ, లోపలున్న చైతన్యము పురుషుడు. ఈ జడ చైతన్యముల ఏకత్వం చేతనే మానవత్వం ఏర్పడుతుంది. అదే అర్ధనారీశ్వర రూపము. సృష్టిలో ప్రతి మానవుడూ అర్ధనారీశ్వరుడే. అందుకే సృష్టిలో స్త్రీ పురుషు లిద్దరికీ ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఉంది. ఒకరు అబల, ఒకరు సబలురు అనుకోవటానికి వీలులేదు. ప్రకృతి సహజంగా వచ్చే లక్షణాలు, మానసిక తత్వాలు,

అంగ వైశిష్ట్యాలు, వాటి విశిష్ట తత్వాలు, పనులు, శక్తులు గుర్తుంచుకుంటూ ఆయా పరిస్థితులకు, ప్రదేశాలకు తగ్గట్లు వర్తించుకుంటూ, సఖ్యతగా, సౌమనస్యంతో జీవించటమే శ్రేయస్కరం.

ఈ ప్రకృతిలో ఆకారమును ధరించిన వారందరూ స్త్రీలే. భగవంతుడొక్కడే పురుషుడు - పురుషోత్తముడు. ప్రపంచంలో **pants, shirts** వేసుకున్నంత మాత్రమున పురుషుడనీ, చీర కట్టుకున్నంత మాత్రమున స్త్రీ అనీ చెప్పడానికి వీలులేదు. మానవ దేహమునకు పురమని పేరు. దేహమనే పురములో నఖ శిఖ పర్యంతం సంచరించే చైతన్య శక్తికే పురుషుడని పేరు. పురుషుడు వ్యష్టి స్వరూపుడు. సమిష్టి స్వరూపుడు పురుషోత్తముడు.

సమిష్టి స్వరూపంలో సమత్వంగా ప్రకాశించి ప్రపంచమునందు ప్రకటింపబడే దివ్యశక్తికే పురుషోత్తముడని పేరు. వ్యష్టి స్వరూపుడైన పురుషుడు శరీరము నందలి హృదయాకాశమున షోడశ కళలతో (పంచభూతాలు, పంచప్రాణాలు, పంచ జ్ఞానేంద్రియాలు, మనస్సు - అన్నిటి మొత్తం 16) ఉన్నాడు. ప్రతి మానవుడు ఈ షోడశ

కళలను పరిపూర్ణమార్గంలో ప్రవేశపెట్టి, పరిపూర్ణంగా అనుభవించి, పరిపూర్ణత్వమును పొందాలి. అదే ఆదర్శం.

పురుషులలో ప్రవృత్తుల ప్రవర్తనలు బట్టి ఎన్ని రకాలుంటారో, ఆ ప్రకారంగా స్త్రీలలో కూడా అన్ని రకాలూ ఉంటారు. స్త్రీ లోని స-త-ర లు వరుసగా సత్వగుణం, తమోగుణం, రజోగుణాలకు సూచకాలు. అయితే సాత్విక గుణములే స్త్రీకి అతి ప్రధానము. సంస్కృతి గల స్త్రీలు లోకానికి ధర్మదేవతలని చెప్పొచ్చు. అట్టి ఆదర్శ స్త్రీలు తమ బిడ్డలకి సరియైన విద్యాబుద్ధులు, శిక్షణనిస్తూ, భావితరాల స్త్రీల హృదయాలలో సరళత, దైవ ప్రేమ, నమ్రత మొదలైన పవిత్ర గుణాలు పాదుకొనేటట్లు చేస్తారు. స్త్రీ పురుషలింగ భేదంగాకాకుండా, జీవితం యొక్క అన్ని విభాగాల్లోను, కర్మ, భక్తి, జ్ఞాన యోగములు నిండి ఉండాలి. 'అద్వైత దర్శనం జ్ఞానం'-అందరూ అట్టి జ్ఞానాన్ని సంపాదించాలి. ఇందుకు ముందు అనుకున్నట్లు 'పురుష' అంటే ఆత్మ, చైతన్యము, ప్రాణము, జీవతత్వము. వీటికి లింగ భేదములులేవు. ఆత్మ ధర్మమే పురుషార్థము. ప్రతి మానవుడూ-స్త్రీ,

పురుషు లిరువురూ ఇట్టి జ్ఞాన ధనాన్ని సంపాదించటమే నిజమైన దివ్యత్వము. అట్టి దివ్యత్వంలో ఏ ఇతర విభాగాలు, విభేదాలు గోచరించవు. అన్నీ, అన్ని కార్యాలూ ప్రేమమయము, జ్ఞానమయము, సేవామయముగా రూపొందుతాయి. ఇట్టి నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక శక్తుల్ని భౌతిక, శారీరక, ఆర్థిక బలములతో కలిపినట్లై తే అవి దివ్య శక్తిగా మారుతాయి. ఇట్టి దివ్య శక్తిని అందరూ సముపార్జించటం తమ కర్తవ్యంగా, ధర్మంగా భావించాలి.

ప్రపంచంలో స్త్రీ పురుషు లిద్దరికీ ధర్మమార్గమే సమానము, ప్రధాన మన్నప్పుడు

"పరులు దూషింప నీవునూ వారి వలనే
తిరిగి దూషింప నీదు ఆధిక్య మేమి
ఏది తప్పని ఎరిగి నావో

దాని చేయక యుండుటే ధర్మ పథము" అను ధర్మ పథంలో సఖ్యతగా, సామరస్యంతో ఉండాలి. సతీ పతులు ఒకరి నొకరు దూషించక, తప్పు పట్టక, నిందించక ఒక మాటగా, ఒక బాటలో ప్రయాణం చెయ్యాలి. పతి

గృహమును పవిత్రమైన మందిరముగా సతి భావించిన, సర్వ విద్యలూ అక్కడే ప్రాప్తిస్తాయి.

"తల్లికైవడి అన్ని తప్పుల సైచి
పుణ్యమొసగు సతుల దేవాలయంబు;
వలదన్న సద్గ్రంథ పఠన కష్టములేక
పలు శాస్త్రములు నేర్పు పాఠశాల;
శ్రమలేక తమయంత సర్వంబు సమకూర్చు
ఆనందమొసగు విహారభూమి;
అజహరాదులనైన ఆడింపగల భవ్య
మహిమ చేకూర్చు సన్మంత్రశాల!
సతుల యనురాగ సర్వార్థ సాధనంబు
శాంత, సౌభాగ్య, కళ్యాణ కల్పకంబు;
ప్రణయ త్యాగోపదేశ వైరాగ్యశాల;
పతిగృహంబె సతులకు పాఠశాల!

అట్టి పవిత్ర పాఠశాలలో శిక్షణ పొందిన విద్యావంతులగు సతులు " మానవ సంఘమునకు తమ సామర్థ్యము, అభిరుచి, మానవత్వము, అభిలాష, స్వభావము, విద్య

యొక్క అంతస్థులను బట్టి వారి జీవిత విధాన ధర్మము, లేదా సుప్రతిష్ఠిత నియమముల కనుగుణమగు, లేదా సంపూర్తి పొందురీతిగ ఎట్టి ప్రయోజనకారక సేవనైననూ చేయనగును. తమ పైనను, తమకుటుంబము పైననూ, తల్లిదండ్రుల పైననూ, అమర్యాదను, అపకీర్తిని, తమ శీలమునకు మచ్చను తెచ్చు దానిని వారొనర్చరు. లోకమున సంచరించినప్పుడు చాల జాగ్రత్తగా మెలకువగా నుండవలెను. పురుషులతో అధిక ప్రసంగము, అత్యధికముగ కలసి మెలగుటలు త్యజించవలెను." పాప మన్నా,చెడు కార్యములన్నా భయ పడటం, మంచి చెయ్యటం, దైవము మీద విశ్వాసం ఉంచటం అవసరం.

పురుషులకు 'పురుష సింహము, మగమహారాజు' అను బిరుదులెన్ని ప్రబలంగా ఉన్నా, సమయం, సందర్భంబట్టి వాటికి సరైన అర్థం అన్వయించుకోవాలి. స్త్రీల పవిత్ర కర్తవ్యపాలన లాగే పురుషులు పాటించవలసిన పవిత్ర కర్తవ్యం కూడా ఉంటుంది. సతిని కీలు బొమ్మల వలె చేతియందుంచుకొని తన ఇచ్ఛారతులు అనుభ వించడము, పురుషాధిక్యతతో చేసిన తప్పుకు పశ్చాత్తాప

పడకుండటం పనికి రాదు. తన బుద్ధి బలం, ధన, భుజ బలాలతో తన అభీష్టాల్ని నెరవెర్చుకుంటూ విర్రవీగడం కూడదు. ఇంకా 'పురుష ప్రయత్నం'అనేది వాడుకలో ఉంది. పురుషుడు తాను సహజంగా చేయవలసిన పనిని, విధిని, ప్రయత్నాన్ని తాను నిర్వ ర్తించాలి. అంతే కాని సోమరి తనంతో తన కర్తవ్యం చెయ్యక భగవంతుడి మీద పెట్టటం భావ్యం కాదు. Genuineగా / Sincereగా చేసిన పురుష ప్రయత్నంలో భగవంతుని సహాయం లభిస్తుంది. మనస్సు యొక్క బలహీనతతో (ధైర్యం లేక) "బాబా అది చెయ్యి ఇది చెయ్యి మామనస్సుమార్చు" అని అడుగు తుంటారు. తన శక్తి యుక్తుల మీద విశ్వాసంతో ప్రయత్ని స్తే, పని చేస్తే భగవదనుగ్రంకూడా లభిస్తుంది. "నాది మనస్సు మార్చే పని కాదు. మీ కర్మ తీర్చు పని నాది' అంటారు బాబా. అలా. మొదట పిరికి తనం, సోమరి తనం నుంచి Self Confidence కి మనస్సు మార్చుకుని, భగవంతునిపై అన్ని పరిస్థితులలోను అచంచల, అనన్య భక్తి విశ్వాసాలుంచాలి.

“ఒక ఆడపిల్ల చేసే పని పది మంది మగ పిల్లలు కూడా చెయ్యరు. ఆడ వారు పట్టుదల పడితే దానిని సాధించే దాకా నిద్రపోరు. మగ వారిలో ఏకాగ్రత తక్కువ. ఆడవారు ఏకాగ్రతతో కారు నడపగలరు, అందుకు మగవారి కార్లకే యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతాయి. ఈ ఏకాగ్రత మగవారిలో కూడా వస్తే దేశం అన్ని రంగాల్లో బాగుపడుతుంది”, అని బాబా ఉద్ఘాటిస్తారు.

ఈ విధంగా భగవాన్ అందించే పవిత్ర సందేశాల్తో స్త్రీ పురుషులిద్దరూ తమ జీవిత లక్ష్యాల్ని సాధించు కుంటూ, ప్రపంచంలో పవిత్ర ఆదర్శాన్ని నిరూపించాలి.

***

# మహిళల పవిత్ర కర్తవ్యము

1995 నవంబరు 19వ తేదిన 'మహిళాదినంగా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో మహిళలందరూ పెద్ద పండుగ చేసుకున్నారు. భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా సమక్షంలో జరుపుకోవటం ఓ విశిష్టత. అయితే అన్నిటికీ ప్రత్యేకతను సంతరింప చేయు భగవాన్, ఈ మహిళా దినానికి కూడా ప్రత్యేక ప్రత్యేకతను ఆపాదిస్తూ, సంవత్సరానికోసారికాదు, ప్రతినెలా 19వ తేదీ మహిళా దినమే అన్నారు. అలాగే ప్రతి నెలా19వ తేదీ మహిళా దినంగా జరుపబడుతున్నది. 1996 అక్టోబరు 19, దసరా నవరాత్రుల సమయంలో రావటం, ఆంధ్రప్రదేశ్ లోని దంపతులు, భక్తులు తలపెట్టిన సప్త సహస్రకలశాభిషేక మహోత్సవాలు (20వ తేదీ) తో కలిసి రావటంతో మరింత శోభను, వైభవాన్ని సంతరించుకుంది. ఆ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని స్త్రీ, పురుషులు, బాలబాలికలు ఉత్తుంగ తరంగాలుగా తరలివచ్చి, స్వామి సన్నిధిలో, ఆంధ్రమాత సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రదర్శిస్తూ గడుపగల్గటం ఎంత గొప్ప అదృష్టమో! ఆ దినాన భగవాన్ తమ దివ్య ప్రసంగంలో ప్రత్యేకం మహిళల కిచ్చిన సందేశంలోని

సంకేతాన్ని అర్ధం చేసుకుని, ఆచరణలో పెడుతూ, ఆనందం నలుదెసలా వెల్లివిరిసేలా చేయటం వారి కర్తవ్యంగా, లక్ష్యంగా భావించాలి.

బాబా స్త్రీలను సంబోధించిటమే "ప్రేమస్వరూపిణులైన దివ్యాత్మస్వరూపులారా", అన్నారు. స్త్రీలు చదువవచ్చు కాని వారి కున్న 'దివ్య బిరుదుల'కు సార్ధకత చేకూర్చాలన్నారు. "స్త్రీ గృహలక్ష్మి, అంటే గృహానికి, భర్తకీ, పిల్లలకీ లక్ష్మికాని అఫీసుకి కాదు. గృహమే ఆదర్శ పాఠశాల. సర్మధర్మాలకు నిలయం. ఎన్ని చదువులు చదివినా, తన గృహాన్ని సరిదిద్దుకోవటం స్త్రీలకర్తవ్యం. అనేక లక్షల కోట్ల విద్యార్థులకు, పిల్లలకు స్త్రీ మాతృమూర్తి. ఆమెయే ప్రధమ గురువు. ఇల్లు బాగైతే జగత్తు బాగవుతుంది. ఇల్లే స్వర్గం. ఇంట్లో ఆనందంలేకపోతే అది నరకమే", అన్నారు భగవాన్. ఎన్ని చదువులు చదివినా, ఎన్ని ఉద్యోగాలుచేసినా 'ఇంట గెలిచి రచ్చ గెలువు' జ్ఞాపకం పెట్టుకోవాలనటమే స్వామి ప్రబోధ. అంటే స్త్రీలు తమ గృహ పరిస్థితులకు తగ్గట్లుగా తమ సమయాన్ని తమ activitiesని ఏర్పాటు చేసుకోవాలి. పాశ్చాత్య పద్ధతులు, నాగరికతలతో ప్రభావితులైన నేటి స్త్రీలు ఉద్యోగాలు, సాంఘిక సేవలు, క్లబ్బులు అంటూ పనివారి మీదో,

ఆయాలమీదో ఇంటినివదిలేస్తున్నారు. 'ఇంటిని చూచి ఇల్లాలిని'చూడు అనే మాటలకి (స్వామి ఇల్లాలు అంటే ఇంటికిఆలి కాని ఆఫీసుకి కాదు అన్నారు) అర్థమేలేకుండా పోతున్నది. అందుకే బాబా అంటుంటారు, 'నేటి పిల్లలు ఆయాచస్తే ఏడుస్తారు కాని తల్లి చస్తే ఏడువరని - అంటే తల్లితో పిల్లలకి అనుబంధం లేకుండా పోతున్నదని.

నేటి పరిస్థితుల్లో తల్లిదండ్రులెలా పాశ్చాత్య జీవన విధానంతోప్రభావితులై ప్రవర్తిస్తున్నారో, పిల్లల్లోకూడా అదే విధంగా పాశ్చాత్య అలవాట్లు, నాగరిగత ప్రభావంతో వారి ఆలోచనా సరళి, ఆహార విహారాలు కూడా చాలా భిన్నంగా ఉంటున్నవి.'సత్యం వద, ధర్మం చర' అనే అధ్యాత్మిక విలువలకు ఆట పట్టుగా 'లోకాస్సమస్తా స్సుఖినోభవంతు' అనే సత్సంప్రదాయాల్ని పోషించిన భారతదేశం నేటి విపరీత, విపతర్క పరిస్థితులనుంచి బయటపడేటట్లు చేయటంలో స్త్రీకి చాలా గొప్ప పాత్రఉంది. 'కార్యేషు దాసి, కరణేషు మంత్రీ, భోజ్యేషు మాతా, శయనేషు రంభా, (సౌశీల్యభార్యా) క్షమయాధరిత్రీ (సౌజన్యశాలిని) అని స్త్రీ చాలాశక్తివంతురాలు, మండోదరి సుబోధలవల్లే రావణాసురుడు ఇంకో 10 నెలలు బ్రతుకగల్గేడు, సీత, సావిత్రి, దమయంతి వంటి మహిళలెంతోమంది ఆదర్శాన్ని

నిరూపించేరు', అన్నారు బాబా. మితి మీరిన ఆశలు, స్వార్థ స్వప్రయోజనాలు, ప్రలోభం, ఈర్ష్య, అసూయ మొదలైన దుర్గుణాలు ఎంత వారినైనా పతనం చేస్తాయి. అందుకు స్త్రీలు మొదట తమను తాము సంస్కరించుకుని, భర్తలు, పిల్లల్లోని దుర్గుణాల్ని నిరోధించాలి.

ఎక్కడో బయట గుడుల్లో ఉన్న భగవంతుడు కాకుండా తన హృదయంలోనే ఉన్న దైవం అడుగడుగునా, ప్రతిక్షణం నడుపుతుందనే భావం పెంచుకుని, తెల్లవారటమే భగవచ్చింతన, భగవన్నామంతో కార్యక్రమాలు మొదలయేటట్లు నేర్పాలి. 'తల్లి, కొడుకు, తోటకూర' కథలోలాకాకుండా చిన్నప్పటినుంచే పిల్లలు సత్యం పల్కేటట్లు నేర్పాలి. వినయ విధేయతలు, సౌశీల్యము, ప్రేమ, సహనం, త్యాగం మొదలైన సద్గుణాలు నేర్పాలి. "పూర్వం అక్షరాభ్యాసంలో ఓం నమశ్శివాయ అని అనిపించేవారు, ఇప్పుడు అక్షరాభ్యాసా లు లేవు సరికదా,'బాబా,బ్లేక్ షీప్, డింగ్ డాంగ్ బెల్, పుస్సీ ఇన్ ది వెల్' లాంటివి, అక్కరకు రానివి నేర్పుతున్నార"న్నారు, స్వామి. దేశ, కాల, పరిస్థితుల్నిబట్టి స్కూల్లో ఏమి నేర్పినా, తల్లిగా ఇంట్లో పవిత్రమైన గుణాలనే విత్తులు పిల్లల మనస్సుల్లో నాటి, దివ్యత్వమనే మొక్కలు పెరిగేలా కృషి చెయ్యాలి.

సున్నితమైన, మధురమైన పలుకులు, వెన్నలాంటి హృదయం, ఎదుటివారి అవసరానికి సహాయం అందించే హస్తం పెంపొందించుకోవాలని బోధించాలి. మాటలు తగ్గించి, నోరు మూయించి, హృదయ ద్వారాలు తెరవటమనే సాధన చెయ్యమనాలి.

హృదయస్థాయిలో భగవంతుని ప్రతిష్ఠించి, పరిపూర్ణ విశ్వాసంతో, ప్రేమతో జీవితం గడుపుమనాలి. ఏదిచేస్తే దానికి ప్రతిఫలం - మంచికి మంచి, చెడుకి చెడు ప్రతి ఫలం అని గ్రహించి, వర్తించటమే నిజమైన ఆధ్యాత్మికత అనే విజ్ఞానం అవిర్భవించే కృషి సల్పమనాలి. పుణ్య ఫలం కావాలంటే పుణ్యపనులు, పుణ్యకర్మలు చెయ్యాలి. పాప ఫలం వద్దంటే పాప కర్మలు చేయకూడదు. ఇది ప్రధాన సూత్రంగా జీవితం గడపాలని బోధించాలి. ఇవే దైవాన్ని వరింపచేసే ప్రధాన మార్గాలు కూడా. ఇట్టి పవిత్ర భావాలు ఏనాడు స్త్రీల హృదయాల్లో పెల్లుబుకుతాయో ఆనాడే ప్రశాంతత వెల్లివిరుస్తుంది. కుటుంబం, సంఘం, దేశం, ప్రపంచం సుభిక్షంగా, సుక్షేమంగా ఉంటాయి.

***

# స్త్రీలు - వారి పవిత్ర కర్తవ్యం

## ఒకప్పుడు

'సత్యం వద, ధర్మం చర' అనే ఆధ్యాత్మిక విలువలకు ఆటపట్టుగా, భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శింపచేసే 'లోకస్సమస్తా స్సుఖినోభవంతు' అనే సత్సంప్రదాయానికి నిలయంగా ఉన్న భారతదేశం

## నేడు

విపత్కర, విపరీత పరిస్థితులను ఎదుర్కొంటున్నది.

## దీనికి

కారణాలేమైనా, కారకులెవరైనా, అవాంఛనీయమైన ఈ పరిస్థితులనుంచి బయటపడి,

## పూర్వపు

సంస్కృతీ సంపదలను పునరుద్ధరించి, జాతి పేరు ప్రతిష్టలు ఇనుమడింపచేసి, దేశగౌరవాన్ని నిలబెట్ట వలసిన అవసరం ఎంతైనా ఉంది.

## ఈ పవిత్ర కార్యంలో

## ఈ మహాయజ్ఞంలో

అందరూ పాత్రధారులు కావాలి. స్త్రీలు, పురుషులు, పిల్లలు తమ తమ పాత్రల్ని మహోన్నతంగా పోషించాలి. అన్నిరకాల, అన్నితరహాల, అన్నితరగతుల ప్రజలు తమకర్తవ్యాన్ని గుర్తించి, దానికి తగినట్లు వర్తించాలి.

## ఈ కర్తవ్య పాలనలో

స్త్రీకి చాలా గొప్ప పాత్ర ఉంది. 'స కార, త కార, ర కారముల సమ్మిళిత శబ్ధమే స్త్రీ.

స కారం సాత్వికగుణానికి, త కారం తమోగుణానికి, ర కారం రజోగుణానికి ప్రతీకలు. మితిమీరిన ఆశలు, స్వార్థ స్వప్రయోజనాలు, ప్రలోభం, ఈర్ష్య, మొదలైన తమోరజో గుణాలకు సంబంధించిన దుర్గుణాలు ఎంత వారినైనా పతనం చేస్తాయి. అందుకు స్త్రీ ఈ మూడు గుణాల్లో సాత్వికాన్నే ఎక్కువగా పోషించుకోవాలి. స్త్రీ శక్తిస్వరూపిణి. అయినా నిర్మాణానికి, నిర్మూలనానికి కూడా కారకురాలు కాగల 'రెండు వైపులా పదునున్న కత్తి' వంటిది. ఆమె త్యాగానికి, భోగానికి కూడా సిద్ధమే.

## అందుకు

స్త్రీ జాగ్రత్త గా తన విశిష్ట స్థానాన్ని గుర్తించి, అర్ధం చేసుకుని, దానికి తగినట్లుగా తనని తాను తీర్చిదిద్దుకునే సంస్కారాన్ని పెంపొందింప చేసుకోవాలి. అప్పుడు భర్త, పిల్లల్లోని దుర్గుణాలు దుర్మార్గాలు నిరోధించగల్గుతుంది. 'కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, భోజ్యేషు మాతా, శయనేషు రంభా, క్షమయా ధరిత్రీ' గా ఏ సమయంలో, ఏ అవసరానికి ఆ విధంగా నడుచుకుంటూ, దివ్యత్వమనే విత్తులు భర్త, పిల్లల మనస్సుల్లో నాటి, పవిత్రమైన మొక్కలు పెరిగేలా చెయ్యగల్గుతుంది. వారిలో మానవత్వం మేల్కొనేటట్లు చేస్తుంది.

స్త్రీ ఏది పట్టినా గట్టిగా పడుతుంది. ఆమెలో పట్టుదల, శ్రద్ధ, ఎక్కువ. అందుకు సమాజంలో రావలసిన మార్పు **(Transformation)** ఆమె ద్వారానే రావాలి. మన దేశంలో పూర్వంకూడా గార్గి, సులభ, మైత్రేయి వంటి భక్త రమణీమణులు; సతీ సావిత్రి, దమయంతి వంటి పతివ్రతామతల్లులు,చూడాల, ఉభయభారతి వంటి సహధర్మచారిణులు, రుద్రమాంబ, రాణీ చిన్నమ్మ లాంటి వీరాంగనలు ఎంతో మంది వివిధ రంగాలలో రాణించిన వారున్నారు. ఏ రంగంలోఉన్నా తమ సహజమైన స్త్రీ

ధర్మాన్ని విడనాడక ఆదర్శ మహిళలుగా భావి తరాలవారిని ఉత్తేజ పరిచారు వారు. నేటి స్త్రీలు కూడా వారి ఆదర్శాన్ని అందుకుని, వారి అడుగుజాడల్లో నడుచుకుంటూ భరతమాత పేరుప్రతిష్ఠలు పునరుద్ధరించాలి.

## దీనికి

స్త్రీలలో సరియైన అవగాహన కలుగచేసే సువిద్య కావాలి. కేవలం జీవనోపాధి విద్య కాకుండా, జీవిత పరమావధిని గుర్తింపచేసేదిగా ఉండాలి. భౌతిక, లౌకిక విద్యలతోపాటు, మనో, బుద్ధి, ఆత్మవికాసానికి దోహదం చేసేదిగా ఉండాలి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ అహింసలనే మానవతావిలువల్ని - ఈ విలువలు మానవునిలో సహజంగా ఉంటాయి కనుక - వ్యక్తీకరించేదిగా ఉండాలి. దీనితో, వారిలో విశాల హృదయం ఏర్పడుతుంది. ఈ విశాల హృదయంతో తను పుట్టిన ఇంటినే కాకుండా, తాను మెట్టిన ఇంటిని కూడా స్వర్గసీమగా చేసుకోగల్గుతుంది. పరస్పర ప్రేమానురాగాలు, త్యాగాలతో కూడిన పవిత్ర దేవాలయంలాంటి గృహానికీ (home) సున్నం, ఇటుక సిమెంటుతో నిర్మంపబడిన ఇల్లు (home) అనే కట్టడానికి భేదం అర్ధమవుతుంది.

అట్టి గృహసామ్రాజ్యానికి స్త్రీ తాను పట్టమహిషిగా, ఆ గృహంయొక్క అందాన్ని, అంతస్థునీ ఇనుమడింప చేసే విధంగా నడుచుకోగల్గుతుంది. పుట్టింట్లోను, మెట్టిన ఇంట్లోను ఉన్న రకరకాల మనస్తత్వాలు, అభిరుచులు, అలవాట్లు ఉన్న పిన్న, పెద్దలతో సఖ్యతగా, ఓర్పుతో, నేర్పుతో ఎలా మసులుకోవాలో అర్థం చేసికొంటుంది. తన, పర ఆలోచన లేకుండా ఇంట్లోని పిల్లల ఆలన చూచుకోవటం; వయస్సులో, అనుభవంలో తన కన్న శ్రేష్టులుగా నున్న పెద్దల అనుభవాన్ని, అదేశాల్ని మన్నిస్తూ గృహాన్ని స్వర్గసీమ గా చేసుకోగల్గుతుంది. ప్రతి గృహంలోను రుచులలో, అభిరుచులలో, నడవడికలో, పద్ధతుల్లో, ఆచారవ్యవహారాల్లో ఆఖరుకి భగవద్విశ్వాసంలో విభిన్న దృకృథంగల 2, 3 తరాలకు చెందిన వ్యక్తులుంటారు. వారందరినీ ఒక మాటగా తన బాటలోకి తీసుకురాలేక పోయినా, వాదోపవాదాలతో వాతావరణం కలుషితం చేయకుండా, పరస్పర ప్రేమానురాగాలు, మంచి అవగాహన, సర్దుబాటు తనం ప్రదర్శిస్తూ, అందరూ కలసి మెలసి సఖ్యతగా, సభ్యతగా, శాంతియుతంగా, అందరూసుఖంగా, ఆనందంగా మనగల్గేటట్లు ఇంటిని ప్రేమ సదనంగా,

శోభానిలయంగా తీర్చి దిద్దుకుంటుంది. 'ఇంటగెలిచి, రచ్చగెలువు', 'ముందు Self తర్వాత help' అనే విషయం సద్బుద్ధితో విచారించి, తన పరిస్థితులకు తగ్గట్లు, తనసమయాన్ని సద్వినియోగ పరుచుకుంటుంది.

అంతే కాని, 'అయ్యో, ఇంటి పనుల్తో, కాసేపు పూజలో కూర్చోలేక పోయేనే; అత్తమామలు, భర్త, పిల్లల్ని చూచుకోవటంలో ఏ రెండు మూడు రోజులైనా పుష్కర సేవకి, ప్రశాంతి సేవకి వెళ్ళలేకపోయానే అని తనను తాను నిందించుకుంటూ, ఇంట్లోని వారిని విసిగించటం, హింసించటం చేయనక్కరలేదు. ఆదర్శ గృహిణిగా, ప్రేమమూర్తిగా ఇంట్లో చేసే ప్రతిపనీ, నిర్మల హృదయంతో తాను నమ్మిన భగవంతుని నామం స్మరించుకుంటూ (నామ స్మరణకు ప్రత్యేకించిన స్థలం అక్కర్లేకుండా నిరంతరాయంగా కొనసాగుతుండేలా చేసుకోవచ్చు) మనస్సు లగ్నంచేసి చేస్తే అదే యోగం అవుతుంది. రక్తి, అనురక్తి, భక్తి మొదలైన పవిత్ర భావాలు పెరుగుతాయి. ఈ సందర్భం లోనే, 'ఇల్లు ఊడ్చే సమయంలో హృదయాన్ని పరిశుద్ధం చేసుకుంటు న్నానని, చపాతీలు ఒత్తినప్పుడు హృదయాన్ని విశాలం చేసుకుంటున్నానని, కూరగాయలు తరిగినపుడు లోని

అరిషడ్వర్గాల్ని వివేకమనే కత్తితో కోస్తున్నాననీ' భావిస్తూ చేస్తూంటే ప్రతి పని పవిత్రంగా మారటమే కాకుండా ఎంతో ఆసక్తి కరంగా, ఉత్తేజ జనకం గాతయారై, పని యొక్క అలసటను తెలియనివ్వదు. అధికానందాన్నిస్తుంది. ప్రేమను పెంచుతుంది.

## అప్పుడు

'సత్యమే నా ప్రచారము
ధర్మమే నా ఆచారము
శాంతియే నా స్వభావము
ప్రేమయే నా స్వరూపము'

అని తమ జీవిత సందేశాన్నందించే సత్య సాయి ఆదర్శం ఆచరణీయమని అర్ధమవుతుంది. స్త్రీ ఇల్లాలుగా (తన భర్తకు, ఇంటికి ఆలి - యజమానురాలు); గృహిణిగా (తన గృహానికి రాణి); గృహలక్ష్మిగా (తన ఇంటికి లక్ష్మి) స్వరూప, స్వభావాలే మారిపోతాయి. దానితో ఆచారవ్యవహారాల్లో, ఆచరణలో - తల్లిదండ్రులకు బిడ్డగా, అత్తమామలకు కోడలుగా, భర్తకు ప్రియసతి, సఖిగా, పిల్లలకు మాతృమూర్తిగా, ఇతర పరివారానికి, పరిచారకులకు ప్రేమప్రదాయినిగా రూపొందుతుంది. ఆయా పరిస్థితుల్లో,

ఎవరికి తగినట్లుగా వారిపట్ల ప్రేమాదరాలు ప్రదర్శిస్థూ నడుచుకోవటమే ధర్మాచరణ.

**ఈ నేపథ్యంలో**

స్త్రీ గుర్తుంచుకోవలసిన ఎన్నో విషయాలున్నాయి.

**అవి**

పాశ్చాత్య నాగరికతా ప్రభావంతన మీదా

తన వారి మీదా పడకుండా సంరక్షించుకోవటం.

**అట్టి రక్షణనిస్తూ**

వారిని మంచి విధంగా ఆదర్శవంతులుగా రూపుదిద్దు కోవటమూను. రాజకీయంగా పరదేశ పరిపాలనలో చాలా కాలం మ్రగ్గిపోయిన మనం, ఆంగ్ల విద్య ప్రభావం అనండి, పాశ్చాత్య నాగరికతా వ్యామోహం అవనివ్వండి, మన దేశ సంస్కృతీ సంప్రదాయల్ని ప్రక్కకునెట్టి, స్త్రీ తన సహజ స్త్రీత్వాన్నేమరచిపోయినట్లు జీవన విధానాన్ని ఏర్పాటు చేసుకుంటున్నది, ఈనాడు. ఆ రకమైన జీవన విధానం, సాంఘిక జీవితం ఓ ఫాషనుగా మోజుపడి, ఆ అలవాట్లకు బానిస అయిపోతున్నది.

“ పాశ్చాత్య విద్యల ప్రభావ మది యేమో
ఆర్యధర్మము లెల్ల ఆరిపోయె;
పాశ్చాత్య విద్యల ప్రాముఖ్య తది యేమో
పరిణయ ధర్మముల్ వమ్ములయ్యె;
పాశ్చాత్య విద్యల ప్రభావ మది యేమో
వేష భాషల యందు మోజుహెచ్చె
పాశ్చాత్య విద్యల ప్రాముఖ్య తది యేమో
సంస్కృత మడుగంటి, సన్నగిల్లె;
తల్లి భాషను మాట్లాడ తప్పుతోచె,
సంఘ మర్యాద పాటింప జంకు పుట్టె,
ధర్మమన్నది బోధింప తప్పిపోయె,
గురువులపై గౌరవము సన్నగిల్లే,
ఇట్టులైనది భారత జాతి నేడు.”

పై మాటల్ని నిశితంగా విచారిస్తే నిజంగానే భారతజాతి ఏ స్థితిలో ఉందో తెలుస్తుంది.

ఈ పరిస్థితుల్లోని స్త్రీ వేషభాషలలో, వస్త్రధారణలో తన జీవిత ధర్మాన్ని, విధానాన్ని పాటించటంలో చాలా

దయనీయంగా ప్రవర్తిస్తూ ఉంది. స్త్రీత్వాన్నే కోల్పోతూ ఉందా అనిపిస్తుంది. చదువుకున్నా, చదువుకోకపోయినా, మగవారితో ఏదో ఒక రంగంలో పోటీ పడి, రాణించాలనే తాపత్రయంతో ఇంటినీ, ఇంటిపనుల్నీ, వంట వార్పుల్నీ, భర్త, బిడ్డల్నీ ఏ పని వాళ్ళకో, ఆయాలకో అప్పచెప్పేసి బయిట ఎక్కువ కాలం గడుపుతున్నది. ఈ తాపత్రయంలో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు విరుద్ధంగా, అసభ్యంగా expose అవనిస్తూ, అవుతూ అసభ్య ప్రవర్తనలో కాలం గడుపుతున్నారు, చాలామంది. వారికి భర్తలు కూడా తమ మార్గంలోనే ఉంటే మరీ మంచిదనే భావన. అలాకాకుండా ఏమైనా ఎదిరింపు ఇంట్లో పెద్దల నుంచో, భర్తల నుంచో వస్తే విడాకుల అస్త్రం ప్రయోగించటానికి సిద్ధంగాఉన్నారు. ఇంట్లో పెద్దవారి influence తో పిల్లలు బుద్ధిమంతులుగా, భక్తిపరులుగా ఉంటే ఇప్పటినుంచే ఈ పిచ్చంతా ఎందుకని, పాశ్చాత్య వేషభాషల్లోను, ప్రవర్తనలోను ప్రవేశ పెడుతున్నారు. అది వారికి ఆనందం. కుటుంబానికి status అనుకుంటున్నారు.

**ఈ విపరీత, అవాంఛనీయ పరిస్థితుల**

## నుంచి బయట పడటానికి
## స్త్రీ చేపట్ట వలసిన బాధ్యతలు,
## నిర్వహించవలసిన కర్తవ్య, కర్మలు ఇవి.

సృష్టికి ప్రతిసృష్టి చేయగల శక్తిమంతురాలు స్త్రీ. అయినప్పటికీ సృష్టిలో మగవారికి, ఆడవారికి ఎవరికి నిర్ణీతమైన పనులు, బాధ్యతలు వారి కున్నాయి. వాటిని సక్రమంగా నిర్వహించటం సులభం, సుఖం, సమంజస మూను. మగవారు ఉద్యోగం చేసి, ధనమార్జించి, భార్యా బిడ్డల్ని పోషించుకుంటూ, గృహయజమానిగా తన కర్తవ్య నిర్వహణ చేయటం, స్త్రీ అనుకూలమైన భార్యగా, ప్రేమమయ మాతగా, గృహయజమానురాలుగా ఇంటిని, ఇంటిలోని వారినీ, భర్తనీ, పిల్లల్ని చూచుకుంటూ, తన బాధ్యతను నెరవేర్చుకోవటమే అందం, అందరికీ ఆనందమూను. అందుకే ' ఇంటిని చూచి ఇల్లాలిని చూడు' అనే సామెత వచ్చింది. ఇల్లు, ఆ ఇంటిలోని పరిశుభ్రత, ప్రశాంతవాతావరణం ఆ ఇల్లాలు యొక్క శక్తి సామర్థ్యాల్ని, దూరదృష్టినీ తప్పక చాటుతాయి. మారిన కాలంతో, మారుతున్న సాంఘిక పరిస్థితులతో స్త్రీ కూడా మగవారితో

పాటు ఉద్యోగరంగంలోకి, ఇంకా అనేక రంగాలలోకి దూక వలసివచ్చినా, స్త్రీ ధర్మాన్ని - భార్య, తల్లి, గృహిణిగా- ప్రక్కకు పెట్టి నిశ్చింతగా ఉండలేదుకదా. అందుకు తప్పని సరిగా ఉద్యోగంచేసే స్త్రీ ఎదుర్కొనే అనేక సమస్యలకి పరిష్కార మార్గాలు అన్వేషించాలి.

మొట్టమొదటి పరిష్కార మార్గం, పవిత్ర వివాహబంధం, విడదీయరాని ఈ అనుబంధాన్ని భార్యాభర్తలు గుర్తించాలి. ఇది అనిర్వచనీయమైన హృదయాలకు సంబంధించిన ప్రేమ బంధంగా గుర్తించాలి. 'ఇద్దరం కలిసి ఒకరినొకరు గౌరవించుకుంటూ కలసి ఆలోచిద్దాం, నిర్ణయిద్దాం, జీవిద్దాం, సంయమముపాటిద్దాం' అని బాసలు చేసుకున్న పవిత్ర బంధంగా, భార్యాభర్తలు గృహస్థ జీవితంలో ఒకcommon understanding కి వచ్చి, చేసుకున్న బాసలు ఆచరణలో పెట్ట ప్రయత్నించాలి. ప్రతి విషయంలోను ఒకరికొకరు సహాయంగా, చేదోడువాదోడుగా ఉంటూ, ప్రతి నిత్యం ఎదురయే సమస్యలకి రభస చేయకుండా, సరిపుచ్చుకుంటూ, సాఫీగా జీవిస్తామన్న నిర్ధారణకు రావాలి. అటువంటి వాతావరణంలో పెరిగిన పిల్లలు కూడా హుషారుగా,

ఆదర్శవంతంగా తయారవుతారు. 'పితృదేవో భవ, మాతృ దేవో భవ' - తల్లిదండ్రుల్ని అర్థం చేసుకుంటూ, గౌరవ మర్యాదలు ప్రేమ ఇస్తూ పెరుగుతారు. భారతీయులు ఆరాధించే వేదమాత, భూమాత, గోమాత, దేశమాతలను గురించి దేహమాత (తల్లి) తెలుపుతుండాలి. ఉదయం లేవటమే ప్రార్థన చేసుకుని, ఏ కొద్ది క్షణాలైనా పూజ చేసుకుని విధి నిర్వహణలో పాల్గొనాలని పిల్లలకి తల్లి చెప్పాలి. పిల్లలు ఇంకా చిన్న వాళ్ళుగా ఉన్నప్పుడు పిల్లలను లాలించి, పాలించి, గోరుముద్దలు తినిపిస్తూ, రామాయణ, మహాభారత గాథల్లోని ఘట్టాల్ని వినిపిస్తూ, అందుండు నీతిని, విలువలని తెలియజేసి పెద్దవారైన తర్వాత ఆ పురాణ పురుషుల ఆదర్శాన్ని అందుకోగల్గేలా చేయాలి. ఈ విధంగా తల్లి చల్లని ఒడిలో అనంత ప్రేమామృతాన్ని ఆస్వాదించి ఎంతో ఎత్తుకు ఎదిగిన ఘనులు ఎంతో మంది - ఆది శంకరాచార్యులు, శివాజి, గాంధీజీ, (ఈ మధ్యనే స్వామి ఉదహరించిన శ్రీ కృష్ణకాంత్) మొదలైన వారెందరో ఉన్నారు! ఇక అవతారమూర్తుల మాతృమూర్తులు గురించి, వారి అదృష్టం గురించి ఎంత చెప్పినా చాలదు.

## ఈ విధంగా

తన గృహంలో చూపిన సహృదయము, సహనము, సచ్ఛీలము, సమానత్వము, సమాజం పట్లకూడా చూపగల్గుతుంది. భిన్నత్వంలోని ఏకత్వం గుర్తిస్తూ అందరిలో ఉన్న ఆత్మ చైతన్యం ఒక్కటే - అందరిదీ ఒకే మానవకులం అనే విశాల దృక్పథం ఏర్పరచు కుంటుంది. అవకాశ మున్నంతలో, కొంచెం వెసులు బాటు చిక్కిన పరిస్థితుల్లోనే సత్సంగం ఏర్పరచి, మంచిగా, హితవుగా, నెమ్మదిగా మంచి విషయాలు మాట్లాడు తుండొచ్చు. తెలుసుకొన వచ్చు, నేర్చుకొనవచ్చు. చిన్నచిన్న సేవా కార్యక్రమాలు, బయట ఏ ఆసుపత్రికి వెళ్ళో, మురికివాడలకు, జైళ్ళకో వెళ్ళి, వారికి అవసరమైన పనులు, ఊరట కలిగించే మాటలు, ఆత్మానందాన్నిచ్చే భజనలు మొదలైనవి నిర్వహిస్తుండవచ్చు.

## ఇంకా

ఈ చిన్నచిన్న సేవాకార్యక్రమాలు కావలసిన కాలక్షేపం అందివ్వటంలేదనుకుంటే, కడుపునింపటం లేదనుకుంటే, ఇంటిని అలక్ష్యం చేయకుండా, భర్తని, పిల్లల్ని అశ్రద్ధ

చేయకుండా, కాలక్షేపం కోసమని తన కున్న శక్తిని, విద్యను సార్థకం చేసే విషయాలలో ప్రవేశ పెట్టొచ్చు. ఇంట్లోనే పదిమంది పిల్లల్కి చదువు చెప్పొచ్చు. (ఇప్పుడు ట్యూషన్లు చెప్పటం, చెప్పించుకోవటం చాలా వ్యాప్తిలో ఉన్న పద్ధతేకదా); డాన్సు, సంగీతం, పెయింటింగు మొదలైనవి నేర్పటం; చేతిపనులు, కుట్లు, రకరకాల వంటలు, గృహాలంకరణ మొదలైనవి. తనకి ప్రవేశమున్నవి -ఎన్నో నేర్పొచ్చు. ఒకొక్క కోర్సుకి ఇంతని ఫీజు పెట్టి డబ్బు సంపాదించుకోవచ్చు. ఇటు టైమూ గడుస్తుంది, సతృప్తికరంగా; అటు వేడినీళ్ళకు చన్నీళ్ళని భర్త సంపాదన ఒక్క దాని మీద ఆధార పడకుండా డబ్బు సంపాదించొచ్చు. ఈ విధంగా ఏ కొంచెం సంపాదించినా ఎంతో సంతృప్తి కరంగా, ఆనందంగా ఉంటుంది,Unhealthy and unholy (అనారోగ్యకరం-మానసికం గా), అపవిత్రమైన ప్రదేశాలకి వెళ్ళి, అనవసర, అసభ్యకర ప్రసంగాలు చేయటం, వేషభాషల్లో expose అవటం ఊండదు. తనకు, వచ్చేవారికి అనుకూలంగా ఉండే సమయాల్లో ఈactivities జరుగుతూ ఉంటాయి కనుక ఎవరికీ ఇబ్బంది ఉండదు. అంతా ఆనందమే. అన్ని వైపులా ఆనందమే వెల్లివిరుస్తుంది.

**ఈ విధంగా**

నేటి స్త్రీ యుగయుగాలుగా, తరతరాలుగా వస్తున్న సనాతన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా (‘ప్రాణంబు కంటె మానంబె ఘనము, భారతీయ సంస్కృతి యందు’) జీవితానికి శోభనిచ్చే సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు తాను ఆచరిస్తూ, అనుభవిస్తూ, కుటుంబంలో సమాజంలో, దేశంలో వానిని వ్యాపింప చెయ్యాలి. అప్పుడు అమ్మలగన్న అమ్మ సాయిమా, దివ్య సంకల్పం - “స్త్రీలు భావి భారత జాతి నిర్మాతలు భారతీయ సంస్కృతి పరి రక్షకులుగా ఉండాలి” అనేది నెరవేరుతుంది. అప్పుడే, ‘భారత సంపదలకిది పంట భూమి, అఖిల దేశాలకిది ఉపాధ్యాయి’ అన్న సాయి మాటలు సత్యమై, నిజంగానే అన్ని దేశాలకు మన భారత దేశం మకుటాయమానంగా వెలుగొందుతుంది.

**శుభం**

భగవాన్ సత్య సాయి ఇచ్చిన ప్రేరణతో, స్ఫూర్తితో సంకలనం చేయబడినదే ఈ వ్యాసం. దీనిలో ప్రతి మాటా, ప్రతి వాక్యం సాయిదే. సాధారణంగా వాడే సామెతలు మొదలైన వాటికి తప్ప, మరెక్కడా కొటేషను మార్కులు వాడబడలేదు. మరి దీని ప్రయోజనం, ఉపయోగం గురించిన సంకల్పం కూడా సాయిదే. సాయి భగవానుల దివ్య హస్తాల్ని అలంకరించగల్గుతే గొప్ప అదృష్టం.

**సాయికే దీని అర్పణ.**

"అనసూయ", **తూములూరు ప్రభ**
సి-66 డి డి కాలనీ, హైదరాబాదు-7.
22-9-2001.

# సర్వజ్ఞులు, సర్వాంతర్యామియైన శ్రీ సత్యసాయి భగవానులకు కృతజ్ఞతాంజలులర్పిస్తున్నాను

సాయి భగవానులు దీనిని నిజంగానే స్వీకరించారట.
వారి దివ్య హస్తాన్ని అలంకరించి, ప్రాణంపోసుకున్న
పవిత్రత తోనే నేడీ రూపం
ధరించి మీ అందరి చేతుల్ని
అలంకరిస్తున్నది.

శుభం.

"అనసూయ", **తూములూరు ప్రభ**
సి-66 డి డి కాలనీ, హైదరాబాదు-7.
7-11-2003

# ముగింపు

ప్రకృతి శక్తి అనుసరించి దానికి వశులై మానవులు - స్త్రీ పురుషులు స్వసామర్ధ్యమును ప్రకటించాలి, సాధించాలి. తమ బుద్ధి బలం, ధన భుజ బలము వల్ల తమ అభీష్టమును నెరవేర్చుకోగలమని, నెరవేర్చుకుంటు న్నామని విర్రవీగినా, ఆ భావం సరైనది కాదు. అది సాధ్యం కూడా కాదు. దైవం యొక్క అనుమతి లేక ప్రకృతిని స్వాధీన పరుచు కొనుట సాధ్యంకాదు. రాముడు పరమాత్మ స్వరూపుడు. సీత ప్రకృతి స్వరూపిణి. ప్రకృతి పరమాత్మ సొత్తు. సీత (స్త్రీ) రాముని - పురుషోత్తముని సొత్తు. రావణుడు సీతను ఆశించి, పరమాత్ముని ప్రక్కకు నెట్టి, తిరస్కరించటం వల్ల తన్నూ, తన వంశాన్ని నాశనము చేసుకున్నాడు. ప్రకృతికి విరుద్ధంగా ఎవరు కానీ సుఖపడ లేరు. సుఖపడరు. "ప్రకృతి జనని కన్నీటి భాష్పంబు తెచ్చు ప్రాణి" తాను ఏడుస్తాడు అనేది సత్యం. ప్రపంచం లోని ఆదర్శాన్ని మానవులు గుర్తించి వర్తించాలి. సూర్యుడు, భూమి, చంద్రుడు మొదలైనవి తమ కర్తవ్యాలు తాము నెరవేరుస్తూ మానవులకు కర్తవ్య బోధ చేస్తున్నారు.

రాముడు, రావణాసురుడు, విభిన్న ప్రపత్తులతో ఉన్నవారు. రాముని జీవితంలోని తాటకి, శూర్పణఖ, సీత విభిన్న ప్రవృత్తులతో ఉన్నవారే. రామాయణ గాధ మొత్తం మత్స రానికి ప్రతీక ఐన మంథర, కామానికి చిహ్నా మైన శూర్ప ణఖల మీద అధారపడి నడుస్తుంది . ఈ రకంగా వివిధ ప్రవృత్తులతో ఉన్నమానవులు ఎంతో మంది మంచి వారి నుంచి మంచిని నేర్చుకుని, చెడ్డ మాటలు వినక పోవటం, చెడ్డపనులు చేయకపోవటం, చెడ్డవారిని నిరసించటం చెయ్యాలి. ఇదే లోకానికి, మానవులకీ క్షేమం.

ఈ విధంగా లోకం సుభిక్షంగా, సుక్షేమంగా నడుస్తూనే ఊంటుంది. మానవ జాతి పురోగస్తూనే ఉంటుంది. దానికి ముగింపు ఉండదు.

ఇట్టి భగవంతుని తీర్మానం కోసం ప్రార్ధించాలి.

**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు.**

**తూములూరు ప్రభ**
**తూములూరు కృష్ణమూర్తి**

# అమ్మ

కౌసల్య సతి సూక్తి గర్భమౌటను కదా,
రాముడు దేవుడై రమణ గాంచె!
సీతా మహాసాధ్వి చెలగిపెంచుట కదా,
కవలు కుశలవులు ఘనులు అగుట!
జిజియా లలామ చెలగి పెంచుట కదా,
వీర శివాజియు పేరు గాంచె!
పుతలిబాయి రంజిలి పెంచుట కదా,
గాంధి మహాత్ముడై ఘనత తెచ్చె!
ప్రాణికోటికి ఈ విధి పరిమళించె
అహరహంబున బ్రోచెడి అమ్మకంటె
ఆదరంబగు వస్తువు అవని గలదె!
అమ్మ ప్రథమాక్షరంబె ఆద్యక్షరంబు.

– బాబా



మానస భజరే గురుచరణం
దుస్తరభవ సాగర తరణం
గురు మహరాజ్ గురు జై జై
సాయినాథ సద్గురు జై జై
ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ
ఓం నమశ్శివాయ శివాయనమ ఓం
అరుణాచలశివ అరుణాచలశివ
అరుణాచలశివ అరుణశివోం
ఓంకారంభవ ఓంకారంభవ
ఓంకారంభవ ఓంనమో బాబా ॥